క్లుప్తంగా

పరిపాలనా విధి, విధానాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: పరిపాలనా విధి, విధానాలపై అవగాహన అవసరమని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు పాలనా విధానాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, పరిపాలనా వ్యవహారాలను తెలుసుకుని ముందుకు సాగాలని సూచించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో గ్రామసభలు ఏర్పాటు చేసి అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు అండగా గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్



మెడికవర్ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న రక్తదాతలు

విజయనగరం ఫోర్ట్: గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు అండగా నిలుస్తున్నారు. గుండె శస్త్రచికిత్సల చేయడానికి అవసరమైన రక్తాన్ని క్లబ్ తరఫున అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2012 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 1002 గుండె శస్త్రచికిత్సలు జరగ్గా.. 899 శస్త్రచికిత్సలకు అవసరమైన రక్తాన్ని క్లబ్ సభ్యులు అందజేశారు. తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో పార్వతీపురానికి చెందిన జి.రామినాయుడుకు గుండె శస్త్రచికిత్స జరగనున్న నేపథ్యంలో క్లబ్ సభ్యులు శనివారం రక్తదానం చేశారు. దీంతో పలువురు క్లబ్ సభ్యులను అభినందించారు.

రెల్లివలస పీహెచ్‌సీని సందర్శించిన నోడల్ అధికారి



రెల్లివలస పీహెచ్‌సీ వద్ద సిబ్బందితో స్టేట్ నోడల్ అధికారి మోహనరావు

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్టేట్ నోడల్ అధికారి ఆర్. మోహనరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిధిలో గల గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. గర్భిణులకు అందుతున్న కల్కారీ సేవలపై వివరించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సంతృప్తికర సేవలు అందించాలని ఆదేశించారు. ఆయనతో పాటు వైద్యాధికారి భాగ్యరేఖ, హెల్త్ ఎడ్యుకేటర్ రమణమ్మ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ వర్మ

నెల్లిమర్ల: నిరుద్యోగ సమస్యలను నిర్మూలించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎస్‌బీఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కో ఆర్డినేటర్ వై.వర్మ అన్నారు. శనివారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణలో ఆయన మాట్లాడుతూ, శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఎస్‌బీఐ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. జూట్ బ్యాగ్‌లకు సంబంధించి 13 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. పదో తరగతి పాస్ అయినా, ఫెయిల్ అయినా శిక్షణ ఇస్తామమని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్ ఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌కు స్పందన



కక్షిదారులకు స్వయంగా వడ్డిస్తున్న వన్‌టౌన్, రూరల్ సీఐలు

విజయనగరం క్రైమ్: ఫూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌కు స్పందన లభించింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రముఖ న్యాయవాది అంజనీకుమార్, విజయనగరం రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సంయుక్తంగా భోజన సదుపాయం కల్పించారు. రాజీ అవ్వదగ్గ పలు కేసులను పరిష్కరంచారు. కార్యక్రమంలో ఎస్సైలు గణేష్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మరో ముప్పై ఏళ్లు జగనన్నే సీఎం..

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



బుక్‌లెట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలన చూసిన ప్రజలు జగన్ మోహన్‌రెడ్డిని మరో ముప్పై సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని 16 సచివాలయాల్లో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాలను దిగ్విజయంగా జరుపుకుని శనివారం గూడెపువలస సచివాలయ పరిధిలో ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెపువలస సచివాలయ పరిధిలో పథకాల వివరాల పొందుపరిచిన డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గూడెపువలస సచివాలయ పరిధిలో ఉన్న ప్రజలకు రూ.15.90 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సమస్యనూ పాదయాత్ర ద్వారా తెలుసుకుని పారదర్శకతంగా సంక్షేమం అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పేదలకు చేసిన మేలు ఒక్కటైనా లేనందునే గత ఎన్నికల్లో ఆయనను చిత్తుచిత్తుగా ఓడించి 23 సీట్లకే పరిమితం చేసినప్పటికీ తీరు మార్చుకోకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత విద్య, వైద్యరంగాలు బలోపేతమయ్యాయని చెప్పారు. నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం బాబు హయాంలో అనారోగ్యశ్రీగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో పక్క రాష్ట్రాల్లోని పెద్ద పెద్ద ఆస్పత్రుల్లో సైతం ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయని చెప్పారు. చంద్రబాబును కుర్చీ ఎక్కించేందుకు రాష్ట్రంలో ప్రతిపక్షాలన్నీ ఏకమై చేస్తున్న తప్పుడు ప్రచారాలు చెల్లవని, ఎన్ని అడ్డంకులు సృష్టించిన త్వరలో జరగనున్న ఎన్నికల్లో 175కి 175 స్థానాలు గెలవడం ఖాయమన్నారు. అనంతరం ప్రజలకు 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' బుక్‌లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పడాల భానుప్రకాశ్, సుందర హరీష్, పడాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు కొయ్య రాజుకమల, కొయ్య లక్ష్మణ్, కొల్లు రామ్మూర్తి, పట్న తాతయ్యలు, దల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి గరుడవాహన సేవ



గరుడ వాహనంపై శ్రీనివాసుడు

విజయనగరం టౌన్: నగరంలోని టీటీడీ కల్యాణ మంటపం ప్రాంగణంలో కొలువైన వేంకటేశ్వరస్వామికి శనివారం సాయంత్రం గరుడవాహన సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పీవీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సాయంత్రం పురవీధుల్లో గరుడోత్సవం కనులపండువగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, సంకీర్తనలు, చెక్కభజనలు, తప్పెటగుళ్లు, కోలాటం, కత్తిసాములు, పులివేషాలు, గోవిందనామాల నడుమ పురవీధుల్లో టీటీడీ కల్యాణ మంటపం నుంచి కోట, మూడులాంతర్లు, గంటస్తంభం, కన్యకపరమేశ్వరి ఆలయం, పీడబ్ల్యూ మార్కెట్, ఎంఆర్ కళాశాల, సంగీత కళాశాల మీదుగా కల్యాణ మంటపం వరకు తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా శనివారం స్థానిక సెయింట్ ఆన్స్ గర్ల్స్ హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ... బాలల, మానవ హక్కులపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పలువురికి జ్ఞాపికలు అందజేశారు. కమిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండ్రింకి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ డిప్యూటీ ఈఓ వాసుదేవరావు, సెయింట్ ఆన్స్ గర్ల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కవిత, గోపి, చిన్నమ్మ, నాగేశ్వరరావు, సురేష్, డాక్టర్ స్వరూప్, ఈశ్వర్ ప్రసాద్, అశ్విని, పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

నైతిక విలువలే ప్రజాస్వామ్యానికి రక్ష

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



విజేతలతో భీశెట్టి బాబ్జీ, తదితరులు

విజయనగరం: నైతిక విలువలే ప్రజాస్వామ్యానికి రక్ష అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ విద్యాసంస్థలలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అవినీతి ప్రజాస్వామ్యాన్ని తినేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఎంత బాగున్నా పాలకులు చెడ్డవారైతే మంచి ఫలితాలు రావన్నారు. దేశంలో అవినీతి పేరుకుపోతోందని, దాన్ని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని చెప్పా రు. అనంతరం 'విద్యార్థులు - నైతిక విలువలు' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలు జి.షర్మిల, కె. లక్ష్మీశ్రావణి, జి.కౌశల్యలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పూడి శేఖర్, ఏపి నాయుడు, లత, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిస్తున్న వారికి సంక్రాంతి పురస్కారాలను అందజేస్తున్నట్టు సర్వేజనా సుఖినోభవంతు సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో 2024 జనవరి 7న పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమాజ సేవ, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, విద్య, వైద్యం, యోగా, కరాటే, మెమరీ పవర్ వంటి వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన వారందరూ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

విజయనగరం టౌన్: వేపాడ మండలం వీలుపర్తి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి హాజరైన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎన్. ఈశ్వరరావు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో పాటు స్థానిక బీజేపీ నాయకులు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, అల్లూరి రామకృష్ణరాజు, ఉప్పలపాటి రాజేష్‌వర్మ, బొబ్బిలి శ్రీను, తదితరులున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: పట్టణంలోని ఉడాకాలనీలో వేంచేసి ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజను శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోట్ల సుగుణాకరరావు జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురుస్వామి కందాల సాయిబాబా ఆధ్వర్యంలో శ్రీను గురుస్వామి పూజాకార్యక్రమంలో పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో నాలుగెస్సుల రాజు, భీశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీల్లో కుమిలి విద్యార్థుల సత్తా..



విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. అండర్-14 ఖోఖో విభాగంలో పాఠశాలకు చెందిన కె. కుమారి, టి.యజ్ఞప్రియ, ఆర్. జయంత్.. కబడ్డీ విభాగంలో కె. మోహనసాయి విజేతలుగా నిలిచారు. అండర్-17 ఖోఖో విభాగంలో డి. శ్రావణి, బి. శ్రావణి, బి. హేమంత్.. కబడ్డీ విభాగంలో కె. సాగర్, మణికంఠ.. అండర్-19 ఫెన్సింగ్ విభాగంలో సీహెచ్ మురళీమోహన్, ఎం.రాజేష్, డి. శ్రావణి, ఎం. త్రివేణి, డి. దుర్గారెడ్డి విజేతలుగా నిలిచి జిల్లా పేరును ఇనుమడింపజేశారు. దీంతో విద్యార్థులను హెచ్‌ఎం శ్రీదేవి, వైస్ సర్పంచ్ జి.సురేష్‌రెడ్డి, పీడీ కమలనాభరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ నిధులు బదిలీ చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ విజయ్‌కుమార్

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన నిర్వహణ నిధులు బదిలీ చేయాలని ఎంఈఓలు యు. సూర్యనారాయణమూర్తి, ఈవు విజయ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌ను జిల్లా అధికారులు ప్రతిపాదించిన మేరకు వేరే జిల్లాల పాఠశాలలకు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించాలని తెలిపారు. అలాగే నాడు - నేడు ఫేజ్-1లో ఉన్న పాఠశాలలకు వచ్చిన ఎస్ఎంఎఫ్ నిధులు ఇతర పాఠశాలలకు ఇప్పటికే కేటాయించినట్లు చెప్పారు. జగనన్న గోరుముద్ద తయారీ సమయంలో వంటవారు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కచ్చితమైన సమాచారంతో ఈ ఏడాది యూడైస్‌ను నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఎంఆర్‌సీ స్టాఫ్, సీఎంఆర్‌టీలు పాల్గొన్నారు.

నేడు నగరంలో శోభాయాత్ర



మాట్లాడుతున్న శ్రీనివాసాసేవా సంఘ ప్రతినిధులు శ్రీధర్, శివరామకృష్ణ

విజయనగరం టౌన్: అయోధ్య రామమందిర నిర్మాణానికి సంబంధించి దేశ వ్యాప్తంగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆదివారం పంపిణీ చేయనున్నట్లు శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు చెరుకూరి శ్రీధర్, ఉపాధ్యక్షుడు అల్లాడి శివరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు రింగురోడ్డు వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఆదివారం ఉదయం పట్టణంలో భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అక్షింతలు, కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలోని 1800 గ్రామాలకు అక్షింతలు, రామమందిరం ఫొటోలు, కరపత్రాలను పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గొర్లె అప్పారావు, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు



బాలాజీ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

విజయనగరం టౌన్: అవినీతి కాంగ్రెస్‌ను దేశం నుంచి తరిమివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆదాయపన్ను దాడుల్లో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహు ఇంటి ప్రాంగణంలో రూ. 200 కోట్ల రూపాయలు లభించడంతో కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా శనివారం బాలాజీ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతిపథంలో దూసుకుపోతుంటే.. కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏపీ మైనార్టీస్ వెల్ఫేర్, క్రిస్టియన్ అఫైర్స్ అడ్వైజర్ బాలస్వామి, తదితరులు

విజయనగరం టౌన్: క్రైస్తవులందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోగలమని ఏపీ మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, క్రిస్టియన్ అఫైర్స్ అడ్వైజర్ డాక్టర్ ఎమ్.బాలస్వామి అన్నారు. విజయనగరం, పార్వతీపురం - మన్యం జిల్లాల క్రైస్తవ నాయకుల ఆత్మీయ సమావేశం శనివారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రైస్తవుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇందులో పలు సమస్యలు పరిష్కారం కాగా.. మరికొన్నింటిని ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. సాయంత్రం పురవీధుల్లో మెస్సియా మార్చ్ నిర్వహించారు. సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆశాజాన్, బిషప్ డాక్టర్ కె.జె.ఫిలోమాన్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు..



నెల్లిమర్ల: మద్దిల ముత్యాలప్పడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

నెల్లిమర్ల: రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు తండ్రి మద్దిల ముత్యాలప్పడు (గారనాయుడు) ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు), రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, మత్స సత్యనారాయణ, రేగాన శ్రీనివాసరావు, తదితరులున్నారు. అలాగే నెల్లిమర్ల నగర పంచాయతీలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు తల్లి అప్పయ్యమ్మ పెద్దకర్మ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, అందవరపు సూరిబాబు పాల్గొని నివాళులర్పించారు. వీరితో పాటు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ..



నెల్లిమర్ల రూరల్: రాజినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి మాజీ సర్పంచ్ పాలూరు రాజినాయుడు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు శనివారం పరామర్శించారు. రాజినాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే తంగుడుబిల్లి చేరుకుని రాజినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

'త్వరగా కోలుకోవాలి'



నెల్లిమర్ల రూరల్: బెల్లాన శ్రీదేవిని పరామర్శిస్తున్న అందవరపు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల చీపురుపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సతీమణి, చీపురుపల్లి మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ బెల్లాన శ్రీదేవిని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు శనివారం పరామర్శించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠంనాయుడు, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తదితరులు శ్రీదేవిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

దీపోత్సవం...



ధ్వజస్తంభం వద్ద శివలింగాకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఓంకారం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

జిల్లా కేంద్రంలోని కోట ప్రాంతంలో గల మూడు కోవెళ్లలో కార్తీకమాసం సందర్భంగా శనివారం సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఓంకారం, శివలింగాకారం ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. దీంతో ఆలయ ప్రాంతమంతా దీపాలు వెలుగులతో ధగధగలాడింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పుస్తక పఠనంతో విజ్ఞానం

చీపురుపల్లి: జ్ఞానసముపార్జనకు పుస్తకపఠనం ఎంతో దోహదపడుతుందని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. పట్టణంలోని సత్యరామ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆశయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మొబైల్ బుక్ లైబ్రరీ ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకపఠనం అలవాటు ఉన్న వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణయాత్మకశక్తి ఉంటుందని వైద్యుల పరిశోధనల్లో వెల్లడయ్యిందన్నారు. అంతేకాకుండా ఒత్తిడి ఎదుర్కొనే శక్తి కూడా పుస్తకపఠనం ద్వారా అలవడుతుందన్నారు. అందుకనే విద్యార్థులు పుస్తకపఠనం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఆకళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ ముకుందరావు, అధ్యాపకుడు ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి



భీమసింగిలో వేంకటేశ్వరస్వామికి తులసీదళాలతో పూజచేస్తున్న అర్చకులు

జామి: మండలంలో పుష్పగిరి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణి హరం సీతరామాచార్యులు స్వామివారిని తులసీదళాల మాలలతో అలంకరించి పూజలు చేశారు. అలాగే భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానఅర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.